క్లుప్తంగా

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (భూపాలపల్లి)లో 2025 – 26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌టీడీఎస్, బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ, బీకాం (సీఏ), బీకాం(బీఏ)కోర్సుల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 91210 04528, 70134 64418, 95028 35848 నంబర్లలో సంప్రదించాలని డాక్టర్ విజయలక్ష్మి సూచించారు.

రైల్వే చీఫ్ ఫార్మసిస్ట్‌కు అవార్డు



కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే పాలిక్లినిక్‌లో చీఫ్ ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్న చింత తిరుపతి.. రైల్వే అవార్డు అందుకున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో తిరుపతి పాల్గొని ప్రథమస్థానంలో నిలిచారు. ఈమేరకు సికింద్రాబాద్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు మాలిని జైన్ చేతుల మీదుగా అవార్డు, సర్టిఫికెట్ అందుకున్నారు. కాజీపేట డీజిల్ లోకోషెడ్ ఎస్ఎస్ఈ రంజిత్, సికింద్రాబాద్ టీఆర్ఎస్ఓ ఓఎస్ శ్రీనివాస్ కూడా అవార్డులు తీసుకున్నట్లు తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో సీఎంఎస్ డాక్టర్ నారాయణ స్వామి, సీపీటీఎం, అధికారులు పాల్గొన్నారు.

సీతారామచంద్ర స్వామి ఆలయ ఈఓగా సత్యనారాయణ

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని సీతారామచంద్ర స్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారిగా ఎస్.సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఆయనకు బాధ్యతలను శేషభారతి గురువారం అప్పగించారు.

ఐఐటీ ర్యాంకర్‌కు సన్మానం



హన్మకొండ: ఐఐటీ ర్యాంకర్ సాయి రిశాంత్‌రెడ్డిని రెడ్డి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు సన్మానించారు. హనుమకొండ విజయనగర్ కాలనీలో రెడ్డి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన, అభినందన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయి 32వ ర్యాంకు సాధించిన సాయి రిశాంత్‌రెడ్డిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో రెడ్డి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి రమణారెడ్డి, సభ్యులు హర్షవర్ధన్ రెడ్డి, జయపాల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రాజేందర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, వైవీ.రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పత్తి పద్మ పాల్గొన్నారు.

గోవధ నిషేధం అమలు చేయాలి

హన్మకొండ అర్బన్: జిల్లాలో గోవధ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలని, ఈ విషయంలో యంత్రాంగం విఫలమవుతోందని వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నాయకులు అన్నారు. ఈమేరకు కలెక్టరేట్ ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ అక్రమంగా సాగుతున్న గోవధశాలలు మూసి వేయాలని, ఆక్రమణలో ఉన్న గోశాలల భూములను రక్షించాలని కోరారు. నగర గో సంరక్షక్ ప్రముఖ్ నంగునూరి నాగరాజు, వీహెచ్‌పీ వరంగల్ మహానగర కార్యదర్శి రాజు, వీహెచ్‌పీ వరంగల్ విభాగ్ సహ కార్యదర్శి ఉదయ్‌కుమార్, కనుకుంట్ల వెంకట్, రమేష్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

వృద్ధురాలి దుర్మరణం



వృద్ధురాలి మృతదేహం

హసన్‌పర్తి: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో గుర్తుతెలియని ఓ వృద్ధురాలు దుర్మరణం చెందింది. అంబాల – కిట్స్ ప్రధాన రహదారిలోని ఏకశిల పాఠశాల సమీపంలో గురువారం అర్ధరాత్రి ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు.. ఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతురాలికి సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది. వృద్ధురాలి ఒంటిపై ఎరుపు రంగు జాకెట్, ముదురు ఆకుపచ్చ రంగు చీరపై గులాబీ రంగుపూలు ఉన్నాయని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. వివరాలకు 87126 85015, 87126 85124, 87126 85097 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేడు రెవెన్యూ సదస్సు

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని రైతు వేదికలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు రెవెన్యూ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ భూసమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

విత్తన ఎంపికే కీలకం



'సాక్షి' ఫోన్ ఇన్‌లో రైతుల సందేహాలు నివృత్తి చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ



సమగ్ర యాజమాన్య పద్ధతితోనే అధిక దిగుబడి

- అనుమతి ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి
- సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ సూచనలు, సలహాలు
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన

ఖిలా వరంగల్: 'వానాకాలం సాగులో రైతులు సరైన విత్తన ఎంపిక, సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడి సాధించవచ్చు. పంటకు విత్తే మూలం.. సరైన విత్తనాలు ఎంచుకుని సమగ్ర విధానాలను అవలంబిస్తే ఆశాజనకమైన దిగుబడులు వస్తాయి' అని వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు. 'సాక్షి' ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఫోన్ ఇన్‌లో జిల్లా నలుమూలల నుంచి రైతులు సాగుకు అనువైన విత్తనాలు, అందుబాటులో ఉన్న రకాల వివరాలే కాకుండా సాగు విధానాలు, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానాలిచ్చారు. రైతులు అడిగిన ప్రశ్నలకు అనురాధ ఇచ్చిన సమాధానాలు ఇలా..

ప్రశ్న: ప్రస్తుత వర్షాలకు వరి నార్లు పోసుకోవచ్చా? ఏరకం విత్తనాలు మేలు?

– రైతు మెండె రమేశ్, పనికెరగ్రామం, నెక్కొండ

జవాబు: జూన్ మొదటి వారం తర్వాత వరినార్లు పోసుకోవచ్చు. ప్రభుత్వం అనుమతించిన సన్న రకాలను విత్తుకుంటే మద్దతు ధరతోపాటు బోనస్ వస్తుంది.

ప్రశ్న: పచ్చిరొట్ట విత్తన ధరలు గతేదాదితో పోలిస్తే పెరిగాయి ఎందుకని?

– జి.సురేందర్ చంద్రగొండ నెక్కొండ

జవాబు: విత్తనోత్పత్తి తగ్గడంతో కొంత మేర ధర పెరిగింది. ప్రభుత్వ సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు జిల్లావ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: డీఏపీ కాంప్లెక్స్ ఎరువులకు సైతం మరింత సబ్సిడీ ఇచ్చే ఆలోచన ఉందా?

– రావుల భాస్కర్, రాయపర్తి

జవాబు: యూరియా వాడకం తగ్గించేలా రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. కాంప్లెక్స్ ఎరువుల్లోనూ యూరియా పాళ్లు ఉంటాయి. ఫార్మల్ ఐడీ విధానం అమలైతే భూమి ఆధారంగా కోటా నిర్ధారించే అవకాశం ఉంది.

ప్రశ్న: పెసర ఎప్పుడు, ఏ రకాలు విత్తుకోవచ్చు?

– తోటకూరి సాయిలు, పెర్కేడు రాయపర్తి మండలం

జవాబు: దుక్కులు సిద్ధం చేసుకుని 60మి.మీల వర్షపాతం నమోదయ్యాక జూన్ మొదటి వారం నుంచి పెసర విత్తుకోవచ్చు. ఎంజీజీ రకాలు అందుబాటులోకి వచ్చాయి.

ప్రశ్న: పంటల సాగుపై మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారా?

– ఏసీరెడ్డి ప్రభాకర్, తూర్పు కోట

జవాబు: రైతుల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. లైసెన్స్‌డ్ డీలర్ల నుంచి విత్తనాలు కొనుగోలు చేస్తే నాసిరకం బెడద ఉండదు.

ప్రశ్న: వానాకాలంలో సాగు చేసే సన్న గింజ వరి రకాలు తెలపండి? – కందుల సారంగం, బొల్లికుంట

జవాబు: సన్నరకాల్లో డబ్ల్యూజీఎల్ 44(సిద్ధి) జూన్ 15 వరకు నార్లు పోసుకుని దీర్ఘకాలిక రకం.. కేఎస్ఎం 1638 రకం, స్వల్పకాలిక రకంలో జూలై నెలలో నారు పోసుకునేందుకు అనువైన రకం ఆర్ఎన్ఆర్ 15048 తెలంగాణ సోనా వంటివి సాగు చేసుకోవచ్చు.

ప్రశ్న: వరిలో చౌడు నేలలను తట్టుకుని మంచి దిగుబడి ఇచ్చే రకాలేంటి?

– పులి అశోక్, లింగగిరి గ్రామం, చెన్నారావుపేట

జవాబు: చౌడు నేలలను తట్టుకొని అధిక దిగుబడి ఇచ్చే దొడ్డు రకం కేఎస్ఎం రకం 118 సాగుకు అనుకూలం.

ప్రశ్న: వర్షాధారంగా సాగు చేసే కంది రకాలను వివరించండి?

– చంద్రమౌళి ల్యాబర్తి, వర్ధన్నపేట

జవాబు: పీఆర్‌జీ 176, టీడీఆర్‌జీ 4, డబ్ల్యూఆర్‌జీఈ97, డబ్ల్యూఆర్‌జీఈ 121, వంటి రకాలను సాగు చేసుకోవచ్చు.

ప్రశ్న: పప్పు ధాన్యాల్లో వాడే జీవన ఎరువులు ఏవి?

– వెంకటేశ్వర్లు, పర్వతగిరి

జవాబు: రైజోబియం 200 గ్రాములు, పాస్ఫో బ్యాక్టీరియా 200 గ్రాములు కలిపి ఒక ఎకరానికి సరిపడా విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసి 24 గంటల్లోపు విత్తనాన్ని విత్తుకోవాలి.

ప్రశ్న: ఆయిల్ పామ్‌లో మొక్కజొన్నను అంతర పంటగా వేసుకోవచ్చా?

– మల్లికార్జున్, చింతకుంట, పర్వతగిరి

జవాబు: 19 నెలల వయస్సు ఉన్న తోటలో అంతర పంటగా మొక్కజొన్న కంటే కూరగాయలు, పెసర, మినుము సాగు మేలు. దుక్కి ఎక్కువగా దున్నకూడదు. అలా చేస్తే ఆయిల్ పామ్ వేరు వ్యవస్థ దెబ్బతింటుంది. యాసంగి పంటగా మాత్రం మొక్కజొన్నకు అవకాశం ఉంది.

ప్రశ్న: మెట్ట వరి సాగులో అధిక దిగుబడి ఇచ్చే రకాలు ఏవి?

– నాగుల్ల కుమారస్వామి, పర్వతగిరి

జవాబు: మెట్టలో వరి సాగు చేస్తే అంతగా దిగుబడులు రాకపోగా.. సమస్యలు ఉత్పన్నమవుతాయి. కలుపు, తెగుళ్ల సమస్యలు ఉంటాయి. అలాగే ఆరుతడి వరి సాగులో ఆశించిన ప్రయోజనాలు ఉండవు.

ప్రశ్న: పచ్చిరొట్ట విత్తనాలు పక్కదారి పట్టకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

– ఎం.తిరుపతిరెడ్డి, మామునూరు

జవాబు: రైతుల కోసం అందుబాటులో ఉంచే పచ్చిరొట్ట విత్తనాలు పక్కదారి పడితే సహించేది లేదు. ఎవరైనా సరే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. తీసుకున్న విత్తనాలపై అవసరమైన ప్రాంతాల్లో క్రాస్ బుకింగ్ చేయిస్తాం.

ప్రశ్న: ఈ వర్షాలతో పత్తి సాగు చేయొచ్చా? పెసర పంట వేసుకోవచ్చా?

– గుండాల కమలాకర్, నల్లబెల్లి

జవాబు: ఈఏడాది రోహిణి కార్తెలోనే వానలు కురుస్తున్నాయి. నేలలో పదును ఆధారంగా జూన్ 10 తర్వాత పత్తి విత్తనాలు విత్తుకోవచ్చు. పెసర కూడా జూన్ రెండో వారం నుంచి విత్తుకోవచ్చు. పెసరలో ఎంజీజీ రకాలు, వరంగల్ రకాలు అనుకూలం.

ప్రశ్న: విత్తనాలు నాసిరకానివి, మంచివి ఎలా గుర్తించాలి?

– వేముల రమేశ్, నల్లబెల్లి

జవాబు: లైసెన్స్‌డ్ విత్తన షాపుల్లో మాత్రమే కొనుగోలు చేయాలి. అన్ని వివరాలతో రశీదు తీసుకోవాలి. అపరిచిత వ్యక్తులు మాయమాటలతో అమ్మే విత్తనాలు నకిలీవని భావించాలి.

ప్రశ్న: బెండ సాగు చేస్తున్నా.. ఆకులు, కాయలు తెల్లగా మారుతున్నాయి? – ధరావత్ నాగు, సూర్యపేట తండా, చెన్నారావుపేట

జవాబు: తెల్లదోమ ద్వారా తెగులు వాప్తి చెందుతుంది. నివారణకు లీటరు నీటికి 1.5 గ్రాములు ఏపీఫెట్ 3 మిల్లీ లీటర్ల వేపనూనె (3000 పీపీఎం) కలిపి పిచికారీ చేసుకోవాలి.

ప్రశ్న: ఆయిల్ ఫాం సాగుకు రాయితీ ఉందా? సాగు చేసుకోవచ్చా?

– సింగారపు యాకూబ్ జిల్లి, చెన్నారావు

జవాబు: ఆయిల్ ఫాం సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. తక్కువ పెట్టుబడితో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం వచ్చే ఈపంటను సాగు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ రైతులకు డ్రిప్ పరికరాలతోపాటు రాయితీ ఇస్తోంది.

ప్రశ్న: ముందస్తు వర్షాలు కురుస్తున్నాయి. పత్తి గింజలు విత్తుకోవచ్చా – బత్తుల ప్రవీణ్, బాపునగర్, చెన్నారావుపేట

జవాబు: వర్షాలు కురిసినప్పటికీ నేల నుంచి వేడి తగ్గలేదు. సమృద్ధిగా వర్షాలు కురిసిన తర్వాతే (జూన్ 10 తర్వాతే) విత్తనాన్ని విత్తుకుంటే వంద శాతం మొలక వస్తుంది.

పిల్లలను బడిలో చేర్పించాలి



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న హెచ్ఎం మల్లారెడ్డి, పోలీస్ సిబ్బంది

మడికొండ: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని మడికొండ మండల పరిషత్ హెచ్ఎం మల్లారెడ్డి కోరారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా మడికొండలోని ఎంఎస్ఆర్‌నగర్‌లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. పాఠశాలల్లో యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు మధ్యాహ్న భోజనం పెడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, కానిస్టేబుల్ రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ముచ్చర్లలో హోమ కార్యక్రమం గురువారం భక్తిశ్రద్ధలతో సాగింది. గ్రామంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన హోమంలో 15 జంటలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో బొడ్రాయి ప్రతిష్ఠాపణ కమిటీ సభ్యులు పెద్ది ఇంద్రాసేనారెడ్డి, మనోహర్, చల్లా వెంకటేశ్వర్ రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, సూర ప్రమోద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన

శుక్రవారం ఉదయం 7.52 గంటలకు బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం జరగనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హాజరవుతారని నిర్వాహకులు పేర్కొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



మహిళా భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కాజీపేట: మహిళలకు ఆర్థికంగా చేయూతనందించి, అన్ని రంగాల్లో వారు రాణించేలా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీలో రూ.21.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన రాణి రుద్రమదేవి మహిళా భవనాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఒక పొదుపు పథకాలకే పరిమితం కాకుండా, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారాలు చేయడానికి ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండు రంగారావు, చామల వాసుదేవా రెడ్డి, సీఐ సుధాకర్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రూ.3.20 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు రూ.3.20 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు గురువారం ప్రారంభించారు. మడిపల్లి నుంచి రాపాకపల్లి వరకు సీఆర్ఆర్ నిధుల కింద సుమారు రూ.2 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు, సీతానాగారంలో సుమారు కోటి రూపాయల ఖర్చుతో బీటీ రోడ్డుతో పాటు సిద్ధాపురం గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం కింద సుమారు రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కర్ణాకర్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్, మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మాజీ సర్పంచ్ మదన్, చిర్ర సుమలత, యుగంధర్, జనగాం కిరణ్, భగత్, రమేష్ యాదవ్, విజయ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ దయాకర్, ఏపీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ బాధ్యులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరు ప్రణీత్‌గౌడ్, బాధ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండలోని డీఈఓ కార్యాలయంలో సూపరిండెండెంట్ శైలజకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్, సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు బుర్ర రాజ్‌కుమార్, కొండ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌డీఎస్ బాధ్యుల వినతి

ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని ఏఐఎఫ్‌డీఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మాస్ సావిత్రి, బాధ్యులు కోరారు. ఈమేరకు ఇన్‌చార్జ్ డీఈఓ మధుసూదన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు రాజు, శశిధర్, అరుణ్, కార్తీక్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాజీపేట: కాజీపేట పట్టణంలోని రైల్వే దేవాలయాల సముదాయం సమీపంలో గురువారం గుర్తు తెలియని 45 ఏళ్ల వయస్సుగల మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రిలోని మార్చురీకి తరలించి భద్రపర్చినట్లు తెలిపారు. వివరాలకు 87126 85009, 87126 85123 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

గంజాయి సీజ్.. ఇద్దరిపై కేసు

మడికొండ: గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 300 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం షహదోల్ జిల్లా తీఖావ మయిర్ గ్రామానికి చెందిన సీరజ్‌సింగ్, సబనం సింగ్ కలిసి భట్టుపల్లి గ్రామంలోని జీవీఆర్ కన్‌స్ట్రక్షన్‌లో కూలీ పనిచేస్తున్నారు. ఈక్రమంలో గంజాయి సేవించేందుకు బోడగుట్ట ప్రాంతానికి వారు వచ్చి సేవిస్తుండగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

మూడు టిప్పర్లు సీజ్

మడికొండ: అనుమతి లేకుండా మొర్రం తరలిస్తున్న మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకుని, ముగ్గురు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గురువారం పెట్రోలింగ్ చేస్తుండగా మడికొండ చౌరస్తా వద్ద మూడు టిప్పర్లను వదిలి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారించారు. అక్రమంగా మొరం తరలిస్తున్న బాపూజీనగర్‌కు చెందిన వంగాల యాకయ్య, మల్లక్కపల్లి గ్రామానికి చెందిన తాటికాయల నరేందర్, కాజీపేట ఫాతిమానగర్‌కు చెందిన గుగులోతు శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు ఎస్సై వివరించారు.

మత్తు పదార్థాలతో చేటు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రమేష్

మామునూరు: యువత చెడు వ్యసనాలతోపాటు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మామునూరు ఇన్‌స్పెక్టర్ రమేష్ సూచించారు. ఈమేరకు వరంగల్ ఆర్టీఏ జంక్షన్ లెనిన్‌నగర్‌లో పోలీస్ కళాజాగృతి బృందం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ యువత మద్యానికి బానిసై జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకోవద్దని హెచ్చరించారు. బాల్య వివాహాల నివారణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని చెప్పారు. అనంతరం పోలీసు కళాజాత బృందం ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఆటాపాటలు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో ఎస్సైలు కృషివేణి, శ్రీకాంత్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గతస్మృతులు గుర్తుచేసుకుందాం

హసన్‌పర్తి: చిన్ననాటి స్మృతులు గుర్తుచేసుకుందాం అని హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాలల 1989 – 90 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు అన్నారు. ఈమేరకు సమ్మేళనానికి రావాలని కరుణాపురం క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరం వ్యవస్థాపకుడు, రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్‌రాజును గురువారం ఆహ్వానించారు. ఈనెల చివరి వారంలో జరగనున్న ఆత్మీయ సమ్మేళనానికి రావాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆరెల్లి వెంకటస్వామి, బొనగాని రమేష్, ఎల్కరాజు సదానందం, కాలె యాదగిరి, కె.పరమేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మార్పీఎస్' కమిటీలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కందుకూరి సోమన్న

హన్మకొండ: ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల కమిటీలు పూర్తి చేయాలని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న మాదిగ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ సూచించారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 31వ వార్షికోత్సవాన్ని జూలై 7న గ్రామగ్రామాన ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల సంస్థాగత నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ ఆధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, నాయకులు ఆరెపల్లి పవన్ మాదిగ, గోవిందు నాగభూషణం మాదిగ, గంగారం శ్రీనివాస్ మాదిగ, బొక్కల నారాయణ మాదిగ, రాజారపు భిక్షపతి మాదిగ, బొడ్డు శాంతి సాగర్ మాదిగ, సుంచు రజిని కుమార్ మాదిగ, అక్కనుకుంట వెంకటస్వామి మాదిగ, సతీష్ మాదిగ పాల్గొన్నారు.

'పాలిటెక్నిక్ కళాశాలను కొనసాగించాలి'



ప్రిన్సిపాల్ పావనికి వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు



చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తూ..

మామునూరు / న్యూశాయంపేట: పశు సంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలను యథావిధిగా కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్‌చేశారు. ఈమేరకు వరంగల్ కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పావనికి గురువారం వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ మామునూరు నుంచి వెటర్నరీ కళాశాలను తరలించి, పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా కుట్రలు జరుగుతున్నాయని వాపోయారు. కళాశాల తరలివెళ్లకుండా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో రేణుక, స్రవంతి, చందన, ప్రవళిక, కీర్తి, భరత్‌కుమార్, రోహిత్, రాజ్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర మహిళా కన్వీనర్ మాస్ సావిత్రి, నాయకులు పోలబోయిన రాజు, గాదె ప్రణయ్, పరిమళ శశిధర్, బండి అరుణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ



విద్యారణ్యపురి: కేడీసీ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు



హన్మకొండ: పర్యావరణ పరిరక్షణ పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు, తదితరులు



వరంగల్: ప్లాస్టిక్ వినియోగం తగ్గిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు, సిబ్బంది

విద్యారణ్యపురి: పర్యావరణ పరిరక్షణతోనే మానవులకు మనుగడ ఉంటుందని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రజనీలత అన్నారు. పర్యావరణ పరిరక్షణ – యువత భాగస్వామ్యం అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

విద్యారణ్యపురి: పర్యావరణాన్ని ప్రతిఒక్కరూ పరిరక్షించాలని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధం, శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం, జల కాలుష్యంపై అవగాహన కల్పించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

హన్మకొండ: ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.శేషాచలం సూచించారు. హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి కళాశాలలో గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేడెట్లతో కలిసి కళాశాల నుంచి కేయూ క్రాస్ వరకు ర్యాలీ నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

వరంగల్: పర్యావరణ పరిరక్షణకు సహకారం అందించాలని వరంగల్ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వి.వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆరెపల్లిలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు.

పర్యావరణం ప్రతీఒక్కరి బాధ్యత

ఖిలా వరంగల్: పర్యావరణం పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అని ప్రగతి ఫౌండేషన్ వరంగల్ చైర్మన్ డాక్టర్ వీరస్వామి, రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ అన్నారు.

రైల్వే ఆస్పత్రి ప్రాంగణంలో..

కాజీపేట రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాజీపేట రైల్వే ఆస్పత్రి ప్రాంగణంలో గురువారం పలు మొక్కలు నాటారు. రైల్వే ఆస్పత్రి సీనియర్ డీఎంఓ డాక్టర్ నిరంజన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రైల్వే వైద్యులు హరిబాబు, ధీరజ్‌కుమార్, రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌భైరవ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం

కాజీపేట అర్బన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని మెడికవర్ ఆస్పత్రి వైద్యులు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హంటర్‌రోడ్డులోని ఆస్పత్రి ఆవరణలో పలు మొక్కలు నాటారు.